# మహానది

MAHANADI TELUGU DAILY

Website: www.mahanadi.net

RNI No. TELTEL . 12/48343

రంగారెడ్డి | సంపుటి : 4 | సంచిక : 94 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | సోమవారం | జూన్ | 2 | 2025 పేజీలు : 8 | వెల : రూ.2.00


## కొత్త వేరియంట్ల తీవ్రత తక్కువే

**ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8.1 సబ్ వేరియంట్లను పర్యవేక్షణలో ఉంచిన డబ్ల్యూహెచ్ఓ**

ప్రపంచవ్యాప్తంగా కొవిడ్ వ్యాప్తి మళ్లీ పెరుగుతు న్న నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఇటీవల స్పందించింది. ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8.1 సబ్ వేరియంట్లను 'పర్యవేక్షణలో ఉన్న వేరియంట్లు'గా వర్గీకరించినట్లు డబ్ల్యూహెచ్ఓ మే 23న ఒక ప్రకటనలో పేర్కొంది. పలు దేశాల్లో వేగంగా వ్యాప్తి చెందుతున్న ఎన్‌బీ.1.8.1 వేరియంట్ కారణంగా ఇన్ఫెక్షన్లు, ఆసుపత్రుల్లో చేరేవారి సంఖ్య ఏకకాలంలో పెరుగుతున్నప్పటికీ, ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఇతర వేరియంట్లతో పోలిస్తే ఇది తీవ్రమైన అనారోగ్యానికి దారితీస్తుందనడానికి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. ఇప్పటికే ఆమోదం పొందిన కొవిడ్ వ్యాక్సిన్లు ఈ కొత్త వేరియంట్ లక్షణాలను, ప్రభావాన్ని తగ్గిం చడంలో సమర్థవంతంగా పనిచేస్తాయని భావిస్తున్నట్లు డబ్ల్యూహెచ్ఓ తెలిపింది.



వైద్యుడి సలహాతో కొన్నిరోజులు

## తీసుకున్నా..

**డ్రగ్స్ ఆరోపణలపై మస్క్ వివరణ**

- మానసిక సమస్యలే కారణమన్న బిలియనీర్
- గతేడాది విస్తృతంగా డ్రగ్స్ వాడారన్న వార్తలను ఖండించిన మస్క్
- న్యూయార్క్ టైమ్స్ కథనం పూర్తిగా అబద్ధమని వ్యాఖ్య
- మస్క్ డ్రగ్స్ వాడకంపై తనకు తెలియదని చెప్పిన డొనాల్డ్ ట్రంప్

ఢిల్లీ,: 2024 ఎన్నికల ప్రచార సమయంలో తాను కీటమైన్‌తో పాటు ఇతర మత్తుపదార్థాలు విస్తృతంగా ఉపయోగించానంటూ వచ్చిన వార్తలను ప్రముఖ వ్యాపారవేత్త ఎలాన్ మస్క్ తీవ్రంగా ఖండించారు. ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని ఆయన స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సలహాదారుగా వ్యవహరించిన ఎలాన్ మస్క్, శక్తివంతమైన అనస్థీషియా డ్రగ్ అయిన కీటమైన్‌ను అధిక మోతాదులో తీసుకోవడం వల్ల మూత్రాశయ సమస్యలతో బాధపడుతున్నారని శుక్రవారం 'న్యూయార్క్ టైమ్స్' ఒక కథనాన్ని ప్రచురించింది.




నేటి నుంచి అన్ని సబ్ రిజిస్ట్రార్

## కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్‌తో రిజిస్ట్రేషన్ లు

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం తోపాటు కృత్రిమ మేధ ( ఎఐ) సేవలను ఉపయోగించుకొని ప్రజలకు మరింత సులువైన సమర్ధవంతమైన సేవలను అందించబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు గాను ఇప్పటివరకు ప్రయోగాత్మకంగా రెండు విడతల్లో 47 చోట్ల స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలుచేయగా తాజాగా జూన్ 2వ తేదీ నుంచి మిగిలిన 97 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. స్టాంప్స్ రిజిస్ట్రేషన్ అధికారులతో నేడు ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆస్తుల క్రయ విక్రయదారులకు సమయం ఆదా అయ్యేలా పారదర్శకంగా అవినీతి రహితంగా మెరుగైన సేవలు అందించేందుకు చేపట్టిన స్లాట్ బుకింగ్ విధానం వల్ల తాము అనుకున్న విధంగానే సత్ఫలితాలు వచ్చాయని, 94 శాతం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు.




నిప్పుతో ఆడుకోవద్దంటూ

## అమెరికాకు చైనా వార్నింగ్

**– తైవాన్ తమ అంతర్గత వ్యవహారమన్న చైనా...**

ఢిల్లీ,: తైవాన్ వ్యవహారం తమ అంతర్గత విషయమని, ఈ విషయంలో ఇతర దేశాలు జోక్యం చేసుకోవద్దని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధిలిన్ జియాన్ స్పష్టం చేశారు. తైవాన్ అంశాన్ని అమెరికా తెరపైకి తీసుకురావడం సముచితం కాదని ఆయన అభిప్రాయప డ్డారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడుగా వ్యవహరిస్తే అడ్డుకుంటామని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ చేసిన వ్యాఖ్యల పై చైనా తీవ్రంగా స్పందించింది. తైవాన్ అంశాన్ని హెగ్సెత్ ప్రస్తావించ డాన్ని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి తప్పుబట్టారు. నిప్పుతో చెలగా టమాడ వద్దని అమెరికాకు గట్టి హెచ్చరిక చేశారు.



తిరుమల శ్రీవారిమెట్టు మార్గంలో

## చిరుత కలకలం..

తిరుమల: ఆదివారం ( జూన్ 1 ) తిరుమల శ్రీవారిమెట్టు మార్గంలో చిరుత సంచారం కలకలం రేపింది... శ్రీవారిమెట్టు మార్గంలోని 500వ మెట్టు దగ్గర పొదల్లో సేదతీరుతూ కనిపించింది చిరుత. దీంతో నడకమార్గంలో వెళుతున్న భక్తులు భయ భ్రాంతులకు లోనయ్యారు. చిరుత సంచారం గురించి సెక్యూరిటీకి సమాచారం అందించారు భక్తులు. ఘటనాస్థలికి చేరుకున్న సెక్యూరిటీ సిబ్బంది సైరన్ మోతతో చిరుతను తరిమేశారు. శ్రీవారిమెట్టు సెక్యూరిటీ చెక్ పాయింట్ దగ్గర అరగంట పాటు భక్తులను నిలిపేశారు అధికారులు. అరగంట శ్రమించిన సెక్యూరిటీ సిబ్బంది సైరన్ మోతతో చిరుతను తరిమేసారు. అనంతరం భక్తులను బృందాలుగా పంపుతున్నారు అధికారులు. వేసవి సెలవులు ముగిసే సమయం దగ్గర పడటంతో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది.



బహిష్కరణ వేటుపై తేజ్ ప్రతాప్ భావోద్వేగ

## పోస్ట్

"అమ్మానాన్నే నా ప్రపంచం" అంటున్న లాలూ పెద్ద కొడుకు

- తనపై రాజకీయాలు చేస్తున్న వారిని "జయచంద్రులు"గా అభివర్ణన
- ఫేస్‌బుక్ పోస్ట్ వివాదంతో గత ఆదివారం ఆర్జేడీ నుంచి తేజ్ బహిష్కరణ
- లాలూ, తేజస్వి, రోహిణిల నుంచి తేజ్ ప్రతాప్ చర్యలపై తీవ్ర స్పందన

పాట్నా: బీహార్ మాజీ ముఖ్యమంత్రి, రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) పార్టీ వ్యవస్థాపకుడు లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబంలో ఇటీవల విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. బాధ్యతారహితమైన ప్రవర్తన కారణంగా తన పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ ను ఆర్జేడీ నుంచి ఆరేళ్ల పాటు బహిష్కరిస్తున్నట్లు లాలూ ప్రకటించారు. తేజ్ ప్రతాప్ ఫేస్ బుక్ ఖాతాలో పెట్టిన ఓ ఫొటో వివాదా స్పదం కావడంతో లాలూ ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనిపై తేజ్ ప్రతాప్ తాజాగా స్పందించారు. తన తండ్రి, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ ను ఉద్దేశించి సోషల్ మీడియాలో ఓ భావోద్వేగ పోస్ట్ పెట్టారు.



## అస్సాంలో భారీ వర్షాలు

**ఎనిమిది మంది మృతి**

అస్సాం: అస్సాంలో భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. వరదలు, కొండచరియలు విరిగిపడటం వలన ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారని అధికారులు ఆదివారం ధృవీకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు, రైలు సేవలకు అంతరాయం కలిగింది. ఈ వరదల కారణంగా 15కి పైగా జిల్లాల్లో 78,000 మందికి పైగా ప్రజలు ప్రభావితమయ్యారు. బ్రహ్మపుత్ర, బరాక్ సహా పది ప్రధాన నదులు ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నాయని కేంద్ర జల సంఘం హెచ్చరికలు జారి చేసింది. ఈ మేరకు రాష్ట్రానికి 'ఆరెంజ్ బులెటిన్' జారీ చేసింది.




జూన్ నెలాఖరులో పంచాయతీ

## ఎన్నికల షెడ్యూల్!

- జులైలో పది రోజుల గ్యాప్‌లో అన్ని ఎలక్షన్స్ పూర్తి చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు
- బీసీ డెడికేటెడ్ కమిషన్ రికమండ్ చేసిన రిజర్వేషన్ల ప్రకారం ముందుకు
- వచ్చే నెల మొదటి వారంలో కేబినెట్ భేటీలో తుది నిర్ణయం

హైదరాబాద్, : రాష్ట్రంలో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి జూన్ నెలాఖరులో షెడ్యూల్ ప్రకటించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు తెలిసింది. అయితే, ఈ రెండు ఎన్నికలను కూడా పది రోజుల గ్యాప్ లోనే పూర్తిచేయాలని భావిస్తున్నది. ఒకవేళ సర్పంచ్ ఎన్నికలు ముందు జరిగితే.. ఆ తర్వాత పది రోజుల్లో ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. లేదంటే ఎంపీటీసీ తర్వాత సర్పంచ్ ఎన్నికలు చేపట్టనున్నారు. ఎంపీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తులతో జరగనుండగా, సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ గుర్తులు ఉండవు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుగా ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించి, ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలకు వెళ్లిన సంప్రదాయాన్ని ఈ సారి కూడా పాటించాలని భావిస్తోంది. అయితే, ముందుగా ఎంపీటీసీ ఎన్నికలు జరిగితే.. ఏ పార్టీ ఎన్ని స్థానాలు గెలుచుకుందో తెలుస్తుంది. మిశ్రమ ఫలితాలు వస్తే అధికార పార్టీకి ఇబ్బందిగా మారి, సర్పంచ్ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ విషయంపై కొందరు ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేస్తుండగా.. అధికారులు మాత్రం ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించడానికి సమ్మతి తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో, జూన్ చివరి నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభించి, జులైలో పూర్తి చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జూన్ మొదటి వారంలో రాష్ట్ర కేబినెట్? సమావేశం జరగనున్నట్టు తెలిసింది. ఈ సమావేశంలోనే రిజర్వేషన్లకు సంబంధించి బీసీ డెడికేటెడ్? కమిషన్? రిపోర్ట్ కు ఆమోదం తెలపనున్నట్టు సమాచారం. ఈ సందర్భంగానే ఎన్నికల నిర్వహణపై చర్చించి, నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది.

అమరావతి,: కలియుగ దైవం వెంకటేశ్వరుడి సన్నిధిలో మళ్లీ వైసీపీ కుట్రలు మొదలయ్యాయని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల దర్శన కంపార్ట్‌మెంట్‌లో నిరసన వ్యక్తం చేసిన వ్యక్తి కాకినాడ రూరల్ తిమ్మాపురానికి చెందిన వైసీపీ నాయకుడు బద్దిలి అచ్చారావు అని లోకేశ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఒక పథకం ప్రకా రం అతడితో వైసీపీ పేటీఎం బ్యాచ్ డ్రామా ఆడించి, వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని ఆయన



తిరుమలలో వైసీపీ మళ్లీ కుట్రలు

## మొదలు పెట్టింది

- ఒక పథకం ప్రకారం అచ్చారావుతో వైసీపీ పేటీఎం బ్యాచ్ డ్రామా అడించిందన్న మంత్రి నారా లోకేశ్
- చైర్మన్ బీఆర్ నాయుడు నేతృత్వంలో టీటీడీ భక్తుల సౌకర్యాలకు పెద్ద పీట వేస్తూ నిరంతరం సేవలు అందిస్తోందని కితాబు
- పవిత్ర తిరుమలపై తప్పుడు ప్రచారం చేసే వారు ఎంతటి వారైనా కఠిన చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించిన లోకేశ్

# సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి

## - నివాళులర్పించిన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య..





**హైదరాబాద్, మహానది బ్యూరో, జూన్ 01:** సీనియర్ జర్నలిస్టు,పాత్రికేయం దినపత్రిక ఎడిటర్ పెంటూకర్ శ్రీనివాస్ అనారోగ్యంతో హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. దాదాపు పాతికేళ్ళుగా జర్నలిస్టుగా వివిధ పత్రికల్లో పని చేసిన శ్రీనివాస్ గత కొంతకాలంగా సొంత పత్రికను నడుపుతున్నారు. శ్రీనివాస్ వయసు 54 సంవత్సరాలు.ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు.

శ్రీనివాస్ మృతికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్రఅధ్యక్షుడు మామిడి సోమయ్య సంతాపం తెలియజేస్తూ నివాళులర్పించారు. ఆదివారం మల్కాజిగిరిలోని గౌతం నగర్‌గల ఆయన నివాసం వద్ద శ్రీనివాస్ భౌతిక కాయంపై పుష్ప గుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య శ్రీనివాస్ తో తనకున్న అనుబంధా న్ని గుర్తు చేస్తూ, ఆయన కుటుంబ సభ్యుల ను ఓదార్చారు. జర్నలిస్టుగా ఎంతో నైపుణ్యంతో చురుగ్గా పనిచేస్తున్న శ్రీనివాస్ ఆరు నెలల క్రితం హఠాత్తుగా స్పృహ కోల్పోయి పడిపోయా రు. రక్తహీనత కరణంగా శ్రీనివాస్ అనారోగ్యం క్షణించింద ని, వైద్య చికిత్సలు చేయించినప్పటికీ ఆయన ఆరోగ్యం మెరుగుపడలేదని, నిమ్స్ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గత రాత్రి చనిపోయారని కుటుంబసభ్యులు చెప్పారు. జర్నలిజమే ఊపిరిగా అదే వృత్తిని నమ్ముకుని దాదాపు పాతిళ్లుగా వివిధ పత్రికల్లో పని చేసి, ప్రస్తుతం తన సొంత పత్రిక **'పాత్రికేయం'** దిన పత్రికను నడుపుతున్నారు. శ్రీనివాస్ అనారోగ్యానికి గురై చనిపోవడం బాధాకరమని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పేర్కొన్నారు. పాతికేళ్ళుగా కలాన్ని నమ్ముకొని జర్నలిస్టుగానే కొనసాగిన శ్రీనివాస్ జీవితంల అనేక కష్టాలమయం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ తన వృత్తిని, సొంత పత్రికను నిరంతరంగా కొనసాగిస్తూ సమాజానికి సేవలందించారని మామిడి సోమయ్య తెలిపారు. శ్రీనివాస్ అకాలమరణం చాలా బాధాకరని పేర్కొంటూ, ఆయన మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మామిడి సోమయ్యతో పాటు జర్నలిస్టులు పద్మారావు,యువశక్తి కృష్ణారెడ్డి, న్యూస్ భూమ్ మూర్తి, తెలుగు భావుట సత్యం, జగదీశ్వర్ రెడ్డి తదితరులు శ్రీనివాస్ భౌతిక కాయానికి నివాళులర్పించారు.

**శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి**

పాతికేళ్ళుగా జర్నలిస్టుగా పని చేసి అనారోగ్యంతో చనిపోయిన శ్రీనివాస్ కుటుంబ ఆర్థిక పరిస్థితి దయనీయమని, అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య కోరారు. చాలాకాలం వివిధ పత్రికల్లో పని చేసి సొంత పత్రికను నడుపుతున్న శ్రీనివాస్ ఇన్నేళ్ళు ఏమీ సంపాదించుకోలేదని, పైగా పత్రిక నిర్వహణ కోసం తన సొంతింటిని అమ్ముకుని



అద్దె ఇంట్లో ఉంటున్నారని తెలిపారు. సమాజం కోసం జర్నలిస్టుగా అంకిత భావంతో పని చేసిన శ్రీనివాస్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని ఆయన కోరారు.

# మున్నూరుకాపులు ఐక్యంగా ఉండాలి

## - ఒకే సంఘంగా ఏర్పాటు కావాలి

### - హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుముల జగన్



**హైదరాబాద్, మహానది న్యూస్, జూన్ 01:** రాజకీయాలకతీతంగా మున్నూరుకాపులు అందరూ ఐక్యమై ఒకే సంఘంగా ఏర్పడాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుముల జగన్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం, ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం కాచిగూడ లోని మ్యాడం అంజయ్య హాల్ లో మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఇంట్లో అయితే కేసులు ఉంటాయో ఆ ఇల్లు బాగుపడదని, ఏ సంఘంకు సంబందించిన కేసులు కోర్టులో ఉంటాయో ఆసంఘం బాగుపడదని అన్నారు. మున్నూరుకాపు మహాసభ, సంఘాలకు సంబంధించిన కేసులన్ని ఉపసంహరించుకోవాలని, అందరూ ఒకే వేదికపైకి వచ్చి ఒకే సంఘంగా ఏర్పాటు కావాలన్నారు. ఒకేసంఘం ద్వారా ఏవరైనా ఎన్నికల్లో పోటీ చేసి గెలిచికులఅభివృద్ధి,సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. మున్నూరు కాపులు ఐక్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి,సంక్షేమం జరుగుతుం దని అన్నారు. మిగతాకుల సంఘాలను కలుపుకుని పోతూ రాజ్యాధికార దిశగా మున్నూరుకాపులు ముందుండాలని, అందరికి ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. మన కుల పెద్దలు ఎంతోమంది కష్టపడి సంఘాన్ని స్థాపించి అనేక కార్యక్రమాలు చేపట్టి ఆదర్శగా నిలిచారని, ఇప్పుడు ఎవరికి వారుగా సంఘాలు పెట్టుకుంటూ



పోతే కుల అభివృద్ధి జరగదన్నారు. వ్యక్తిగత ఎజెండాలను పక్కన పెట్టి సంఘ అభివృద్దే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అప్పుడే మున్నూరుకాపు విద్యార్థులకు తగిన ప్రోత్సాహం లభించి ఎంతో ఉన్నత స్థానాలకు ఎదుగుతారని, మన పిల్లలను మనం విద్యావంతులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్ రావు మున్నూరుకాపు మహాసభ నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా అధ్యక్షుడుపిల్లిశ్రీనివాస్ రావు తో పాటు 29మంది ఎన్నికైన కార్యవర్గ సభ్యులు, 22 మంది నామినెటెడ్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మున్నూరుకాపు యువక మండలి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండారుశ్రీధర్,మల్కాజి వేణుగోపాల్, అమరం చంద్రశేఖర్, చేపూరి వెంకటేశ్వర్లు, మించు నర్సింగ్ రావు, శ్రీపతి సతీష్, గోపిశెట్టి ప్రమోద్, మామిండ్ల అశోక్,మించు నర్సింగ్ రావు,చందు,తేళ్ల విశ్వేశ్వర్, ఉగ్గే శ్రీనివాస్ పటేల్, చామకూర సుజాత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# అపార్ట్మెంట్ అభివృద్ధి-నిర్వహణ భేష్





## - పరిశీలించిన ప్రశంసించిన స్థానికులు

**ఎల్బీ నగర్,మహానది న్యూస్,జూన్ 01:** ఎల్బీ నగర్ రాక్ టౌన్ కాలనీలో డెవలప్ మెంట్, మెయింటేనెన్స్ విషయంలో ఆదర్శంగా నిలిచిన ఏసీఈరత్న పర్ల్ అపార్ట్మెంట్ ను స్థానిక కాలనీ వాసులు, పలు అపార్ట్మెంట్‌ల వాసులు ఆదివారం సందర్శించారు.

ఈ సందర్భంగా వారు అపార్ట్మెంట్ లోని రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, సోలార్ సిస్టమ్, పచ్చదనం-పరిశుభ్రత,సెక్యూరిటీ సిస్టమ్ తదితర ఏర్పాట్లను, మెయింటెనెన్స్‌ను పరిశీలించి అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా అపార్ట్మెంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కామేశ్వర రావు,అసోసి యేషన్‌వ్యవ స్థాపక ప్రధాన కార్యదర్శి మామిడి సోమయ్య, కోశాధికారి ఏ.రవీందర్ రెడ్డి తదితరులు అపార్ట్మెంట్ డెవలప్ మెంట్, మెయింటెనెన్స్ పై వారికి వివరించారు.



రాక్ టౌన్ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఎక్కడా లేని విధంగా ఏసీఈ రత్న అపార్ట్మెంట్‌లో అభివృద్ధి, పచ్చదనం-పరిశుభ్రత, నిర్వహణ చాలా బాగుందని ప్రశంసిస్తూ అభినందించారు.

# జమిలి ఎన్నికలకు మద్దతివ్వాలి

## - బిజెపి రాష్ట్ర నాయకులు మెంటపల్లి పురుషోత్తం రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మెంటపల్లి పురుషోత్తం రెడ్డి

**వనపర్తి, మహానది ప్రతినిధి,జూన్ 01:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ మొదటి స్థానంలో నిలవాలంటే జమిలి ఎన్నికలకు మద్దతు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర నాయకులు మెంటపల్లి పురుషోత్తం రెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి మండలంలోని చిమన గుంటపల్లి గ్రామంలో మండల అధ్యక్షులు వెంకటేష్ అధ్యక్షతన "ఒకే దేశం ఒకే ఎన్నిక" అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో 60 ఏళ్లు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ప్రజా ఆర్థిక వ్యవస్థలో దేశాన్ని అధః పాతాళానికి పరిమితం చేసిందన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన 11 ఏళ్ల పాలనలో అమెరికా, చైనా తర్వాత మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టారన్నారు. స్వాతంత్రానంతరం నాటి ప్రధానమంత్రి నెహ్రూ జెమిని ఎన్నికలు నిర్వహించారని ఆయన గుర్తుచేశారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం కుటిల రాజకీయ నేతలతో పార్లమెంటు శాసనసభ, స్థానిక ఎన్నికలు వేరువేరుగా నిర్వహిస్తూ.. ఎలక్షన్ కోడ్‌ల పేరిట దేశాన్ని అభివృద్ధి చెందకుండా కమ్యూనిస్టు పార్టీతో కలిసి ముస్లిం టెర్రరిస్టుల చందాలకు అలవాటు పడి దివాలా తీయించారన్నారు.మొన్న జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం పెహల్గాం దాడి కూడా ముస్లిం, హిందువల మధ్య మత ఘర్షలను తెరలేపి ఆర్థిక వ్యవస్థను నాశనం చేయాలనుకున్న టెర్రరిస్ట్ దేశాలకు ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత రక్షణ వ్యవస్థ ప్రతిభా పాటవాలను ప్రపంచానికి తెలియజేయడం జరిగిందన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశాన్ని మొదటి స్థానంలో నిలబెట్టాలంటే, శాసనసభ శాసనమండలి, పార్లమెంట్ ఎన్నికలు ఒకేదపాలో , స్థానిక ఎన్నికలు ఒకే దపాలో జరిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు భారతదేశాన్ని మొదటి స్థానం అడ్డుకోవడం ఎవరికి సాధ్యం కాదన్నారు.దీనిపై ప్రతి ఒక్కరు కూడా అవగాహన కల్పించుకొని వన్ నేషనల్, వన్ ఎలక్షన్ (ఒకే దేశం ఒకే ఎన్నిక)జమిలి ఎన్నికలకు మద్దతుగా నిలబడాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ పెద్దిరాజు, మండల అధ్యక్షులు సంత వెంకటేష్ ప్రధాన కార్యదర్శి సుదర్శన్ ,నాయకులు చిన్నయ్య యాదవ్, లక్ష్మీకాంత్ రెడ్డి, సత్యనారాయణ రావు, మధుసూదన్ రెడ్డి, కర్ణాకర్ ,నీలేందర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజలకు ఎంపీ వద్దిరాజు శుభాకాంక్షలు

**హైదరాబాద్, మహానది బ్యూరో, జూన్ 01:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్ని వర్గాల ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రజలకు అన్ని రంగాలలో కొనసాగుతున్న అన్యాయాలను చూసి సహించలేక తమ నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావు డిప్యూటీ స్పీకర్ పదవిని త్యజించి 2001లో టీఆర్ఎస్ స్థాపించారన్నారు.మహాత్మాగాంధీ చూపిన అహింసా మార్గాన్ని కేసీఆర్ అనుసరించి మహొద్యమాన్ని నిర్మించారని ,తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి ప్రజల చిరకాల ఆకాంక్షను సాకారం చేశారని ఒక ప్రకటనలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.అభివృద్ధి, సంక్షేమం రెండు కండ్లుగా మహానేత కేసీఆర్ పదేళ్ల సుపరిపాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవించారన్నారు.పాతబ డిపోయిన రాష్ట్ర ప్రధాన పరిపాలనా కేంద్రం సచివాలయాన్ని అధునా తనంగా, అద్భుతంగా కట్టించి, దానికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టడం జరిగిందన్నారు.నగరం నడిబొడ్డున, సచివాలయానికి సమీపాన 125 అడుగుల మహనీయులు అంబేద్కర్ విగ్రహాన్ని కేసీఆర్ నెలకొల్పడాన్ని ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు.నేరాలను అరికట్టేందుకు,ప్రజల భద్రతకు అధునాతన సాంకేతిక విలువలతో కూడిన పోలీస్ కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.హైదరాబాద్ మహానగరంలో వాహనాల రాకపోకలు సజావుగా ముందుకు సాగేందుకు గాను పలు ఫ్లైఓవర్స్,అండర్ పాసులు నిర్మించారని తెలిపారు.కేసీఆర్ నాయకత్వాన సుస్థిరమైన పాలన కొనసాగుతుండడం,శాంతిభద్రతలు సజావుగా ఉండడం, సరళమైన విధానాలతో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తరలివచ్చా యని, అమెజాన్, గూగుల్,మైక్రోసాఫ్ట్,ఆపిల్,ఉబెర్, ఇన్ఫోసిస్ తదితర బహుళ జాతి సంస్థలు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాయని ఎంపీ రవిచంద్ర చెప్పారు.రాష్ట్రంలో కొత్తగా 23జిల్లాలను ఏర్పర్చి ప్రభుత్వ శాఖలన్నింటిని ఒకేచోట చేరుస్తూ కలెక్టరేట్లను కట్టించారని, వైద్య, నర్సింగ్ కళాశాలలను ప్రారంభించారని ఎంపీ వద్దిరాజు కొనియాడారు. మహానేత కేసీఆర్ కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేసి మూడేళ్ల స్వల్ప కాలంలోనే పూర్తి గావించి సుమారు 2కోట్ల 45లక్ష లకు పైగా ఎకరాలకు సాగునీళ్లను సమృద్ధిగా అందించి తెలంగాణను సస్యశ్యామలంగా, అన్నపూర్ణగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు.ఇక సంక్షేమం విషయానికొస్తే,



కేసీఆర్ పేద బడుగు బలహీన వర్గాల వారందరికి మేలు జరిగేలా పథకాలు, కార్యక్రమాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలుపర్చారని ఎంపీ రవిచంద్ర చెప్పారు.అన్ని వర్గాల పిల్లలకు ఇంగ్లీష్ మీడియంలో నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఉచిత విద్యనంది ంచేందుకు 1104 గురుకులాలను నడిపించిన గొప్ప పాలనాదక్షులు కేసీఆర్ అని పేర్కొన్నారు.విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించాలను కునే యువత కోసం ఓవర్సీస్ పథకాన్ని ప్రవేశపెట్టి 20లక్షల చొప్పున ఉచితంగా సాయమందించారని ఎంపీ రవిచంద్ర తెలిపారు. వృద్ధాప్య,వితంతు,గీత, నేత,బీడీ కార్మికులు, వికలాంగులకు పింఛన్ సాయాన్ని పెంచారని, కళ్యాణలక్ష్మీ,షాదీ ముబారక్ పథకాలు తెచ్చి పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు రూ. 1,00,116 ఉచితంగా అందించారన్నారు. మాతా శిశు సంరక్షణకు కేసీఆర్ కిట్,అమ్మ ఒడి కార్యక్రమాలు, అంగన్ వాడీల ద్వారా, ప్రభుత్వ పాఠశాలల్లో పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించారని ఎంపీ వద్దిరాజు వివరించారు.ఇదంతా కూడా ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు, సుదీర్ఘ రాజకీయ,పాలనానుభవం కలిగిన కేసీఆర్ తోనే సాధ్యమయిందని ఎంపీ రవిచంద్ర స్పష్టం చేశారు.రాష్ట్ర వ్యవస్థాపన దినోత్సవం సందర్భంగా కేసీఆర్ సుపరి పాలనను మరోసారి గుర్తు చేస్తూ తెలంగాణ వాసులు,దేశవిదేశాలలో నివసిస్తున్న,స్థిరపడిన తెలంగాణ బిడ్డలందరికి ఎంపీ వద్దిరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## జర్నలిస్టుల అక్షర సైన్యానికి

# ఈరోజు అవమాన దినమే..

## నవ సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది...!

**కలమే ఆయుధం అయితే అవినీతి శాసనం అంతమవుతుంది..!**
**తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని...**
**జర్నలిస్టుల అక్షరసైన్యం నూతన సమాజ నిర్మాణానికి అంచురేఖ..!**
**కలమే విప్లవానికి ఆయుధం ధర్మ పోరాటానికి దిక్సూచి,**
**చరిత్రను తిరగరాయగల శక్తి కలంలో ఉందని, ఆ కలం నీతి నిజాయితీకి**
**నిలువెత్తు సాక్షాలు - ఫోర్త్ ఎస్టేట్ పునర్ధాపనకు పిలుపు...**

**ఒక జర్నలిస్టు తన కలాన్ని ఆయుధంగా మార్చుకుంటే, అవినీతి పాలకులకు అడ్డుకట్ట పడుతుంది. ఒక అక్షరం లక్ష మెదడులను కదిలించగలదు. అది చరిత్రను మలచగలదు.**
**మీడియా అంటే కేవలం వార్తలు రాయడమే కాదు, ప్రజాస్వామ్య రక్షణకు అడుగడుగునా ప్రశ్నలు వేయడమే.**
**తెలంగాణ ఉద్యమంలో కలం పాత్ర కెరటాలు.**
**తెలంగాణ ఉద్యమ కాలంలో జర్నలిస్టులు నడిపిన అక్షర పోరాటాన్ని గుర్తు చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు గుర్తింపు ఎక్కడ ఇచ్చింది.? జర్నలిస్టులకు జీవన ధర్మ భృతి ఏది.?**

**(పర్కాల సమ్మయ్య గౌడ్,సీనియర్ జర్నలిస్టు)**

తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులతో సహా ఉద్యమ పోరాటాన్ని సాగించి తెలంగాణ కోసం జర్నలిస్టులు ఆత్మహత్య చేసుకున్న చరిత్రను పక్కకు పెట్టి కనీసానికి జర్నలిస్టులకు ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వకపోవడం బాధాకరం.

నాటి ప్రభుత్వమైనా నేటి ప్రభుత్వమైనా జర్నలిస్టులకు ప్రతినెల జీవన భృతి కల్పించాలని ఆలోచన పెట్టకపోవడం కూడా చాలా బాధాకరం. తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున జర్నలిస్టులకు మీరు ఇస్తున్న గౌరవం ఏది.? ఇంకా అమాయకంగా బానిసలుగా కష్టాన్ని మోస్తూ ప్రజల కష్టాలకు పరిష్కారం చూపిస్తూ ప్రభుత్వ అధికారులకు కనువిప్పు కలిగే వార్తలు రాస్తున్న జర్నలిస్టులకు ఏది గౌరవం.? అడుగడుగునా అగౌరవమే అణచివేతనే ఈ అణచివేత ఇంకెంతకాలం.? పొట్ట చేత పట్టుకొని పెన్ను పేపర్ పట్టుకుని ఎంతకాలం ఇంకెంతకాలం ఎదురు చూపులు, ఈ ప్రభుత్వమైన పట్టించుకుంటదని ఆశపడ్డాం దగాపడ్డాం బోర్లా పడ్డాం అవమాన పడ్డాం ఆవేదన పడ్డాం ఆలోచన పడ్డాం ఇక ఇంతేనా.?ఇదేనా మీరు జర్నలిస్టులకు ఇచ్చేగౌరవం అని నేను రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను.ఇదేనా మాకు మీరు ఇస్తున్న అవమాన పేటికలు అని నేను ప్రశ్నిస్తున్నాను.

**ఈ ప్రజాస్వామ్యంలో కలానికి ఇంకెన్నాళ్లు సంకెళ్లు.**

సత్యం ధర్మం నీతి నిజాయితీ అనే నాలుగు పునాదులపై ప్రతిక్షణం ప్రయాణం చేస్తూ నడిచే జర్నలిస్టుల పోరాటమే ప్రజాస్వామ్య రక్షణకు మూలం.పాలకుల దుర్నీతికి వ్యతిరేకంగా నిలిచే కలం వీరులకు తెలంగాణ అవతరణ దినోత్సవం రోజు కూడా అవమానమేనా.? ఎందరికో ప్రభుత్వ ఉద్యోగస్తులకు అవార్డురివార్డులు అందిస్తుంది ఎందరో జర్నలిస్టులు వారికి గుర్తింపు ఏది.? వారు ఏ పాపం చేశారు ఒక్కసారి రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చెయ్యి దాటిపోయింది సమయం అయిపోతుంది తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టు సంఘాలన్నీ ఏకమై జెఎసిగా మనం ఏకమై మన హక్కుల సాధన కోసం ఐక్యత పోరాటం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.జర్నలిజం గుప్పిట్లోనే ఏ ప్రభుత్వమైనా సాగుతుంది.

కలం యోధులు పాలకుల దుర్నీతిని ఎండగట్టాలన్న పంట పండాలన్న అధికారం చేపట్టాలన్న అధికారం తుడిచి పెట్టుకపోవాలన్నా అదిజర్నలిజం గుప్పి ట్లోనే ఉంది. అదితెలిసి కూడా నేడు జర్నలిస్టులను అవమాన పరుస్తుంది ఈ ప్రభుత్వం అని నేను ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నాను. ఒక వార్త ఒక బాధను తొలగిస్తుంది. ఒక బాధ ఒక వార్తకు జీవం పోస్తుంది. ఒక ఆలోచన సమాజాన్ని మార్చేస్తుంది ఒక్కొక్క అక్షరం లక్ష మెదళ్లను కదలిస్తుంది.జర్నలిజం వృత్తి ప్రతిక్షణం సంతోషిస్తుంది మరొక్క క్షణం బాధలో కూరుకుపోతుంది.

వృత్తి ధర్మాన్ని పాటిస్తూ ప్రజల హక్కుల కోసం పోరాడే జర్నలిజం వృత్తి అనేకసార్లు ఓడిపోతూనే ఉంటుంది. అయినా గాని అధైర్య పడకుండా ధైర్యాన్నిచ్చే స్పష్టమైన సంకేతంగా నిలుస్తోంది. చరిత్రను మలచాలంటే జర్నలిజమే, చరిత్రను చాపను చుట్టినట్టు చుట్టి మూలకు పడవేయాలన్న జర్నలిజమే, ఇది రాజకీయ నాయకుల వల్ల కాదు, ఒక్కొక్క సందర్భంలో రాజకీయ నాయకులకు జీవితాన్ని ప్రసాదించేది కూడా జర్నలిజమే, ఒక్కొక్కసారి రాజకీయ నాయకుల జీవితాలను నేలకేసి కొట్టడం కూడా జర్నలిజమే,ఎన్ని కష్టాలు నష్టాలు అక్రమ కేసులు ఎదురైనా గానీ ధైర్యంగా నిలిచేది ఒక్క జర్నలిజమే, ఆ జర్నలిజాన్ని కూడా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఇక్కడ స్పష్టం అవుతుంది. లేకపోతే ఎందరో సీనియర్ జర్నలిస్టులు ఉన్నారు వారికి తెలంగాణ అవతరణ దినోత్సవం రోజు కూడా కాసింత సత్కరించాలని ఆలోచన రాకపోవడం తీరని బాధల సముద్రం.



**(పర్కాల సమ్మయ్య గౌడ్,సీనియర్ జర్నలిస్టు)**
**8332022212 - 9948701109:**

# మిల్లర్లతో కుమ్మక్కైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం

**- స్థానిక ఎన్నికలు నిర్వహించే దమ్ము లేదు - వనపర్తి జిల్లా బీజేపీ అధ్యక్షులు డి.నారాయణ**



**సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు నారాయణ**

వనపర్తి,మహానది ప్రతినిధి,జూన్ 01: రాష్ట్రంలో మిల్లర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారని బీజేపీ వనపర్తి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మండిపడ్డారు. ఆదివారం బిజెపి జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు ఆధ్వర్యంలో లక్ష్మి కృష్ణ గార్డెన్స్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 20 రోజులుగా వరి ధాన్యం కుప్పలుగా పేరుకుపోయినా.. తూకం వేయకుండా నానా ఇబ్బందులు పెడుతున్నారని ఆయన విమర్శించారు. శ్రీరంగాపూర్ మండల కేంద్రం కొనుగోలు కేంద్రంలో దాదాపు 20 వేలకు పైగా పేరుకుపోయిన ధాన్యం సంచులను వెంటనే తూకం చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వెంకటేశ్వర్లుకు ఫోన్ ద్వారా చెప్పడం జరిగిందన్నారు. అడిషనల్ కలెక్టర్ స్వయంగా కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రెండు మూడు రోజుల్లో పూర్తిగా ధాన్యాన్ని కాంటా చేసి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. సీఎంఆర్ ప్రక్రియలో పదేళ్లు టీఆర్ఎస్, 18 నెలలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాణానికి బొమ్మ బొరుసుగా వ్యవహరిస్తూ రైస్ మిల్లర్ల తో కుమ్మకై భారీగా అవినీతికి తెరలేపారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్థానిక ఎన్నికలు నిర్వహించే ధైర్యం లేదని, రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ చిత్తు చిత్తుగా ఓడిపోవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ.. టిఆర్ఎస్ ప్రభుత్వంలో వచ్చిన దాన్యం ఉత్పత్తికి మూడు రెట్లు పంట వచ్చిందని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్పత్తికి సరిపోను రైస్ మిల్లులు, లారీలు, హమాలీలు గన్నీ బ్యాగులు, సుత్తిలీల ఉంచడంలో పూర్తిగా విఫలం చెందారన్నారు. ప్రభుత్వానికి, అధికారులకు సమన్వయం కొరవడి రైతు అరిగోస పడుతున్నారని, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ బంగాళాఖాతంలో కలిసిపోవడం ఖాయమన్నారు. బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మున్నూరు రవీందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వరి కొనుగోలు విషయంలో అసమర్థతతో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 14 రకాల చిరుధాన్యాలపై మద్దతు ధర పెంచి రైతులకు అండగా నిలిచిందని ఆయన కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుంటే మోడీ ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జూన్, జూలై, ఆగస్టు నెలలకు ఒకేసారి పంపిణీకి ఆదేశాలిచ్చారని అన్నారు.సన్న బియ్యం పేరిట కాంగ్రెస్ నాటకాలు ఆడుతుందని, రేషన్ షాపులలో పూర్తిగా కేంద్ర ప్రభుత్వం తన నిధులతో ఉచితంగా పంపిణీ చేస్తుంటే కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటో, మంత్రుల ఫోటోలు వేసుకొని ఉద్దెర పోజులిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కడ రామన్ గౌడ్ , ఉపాధ్యక్షుడు బండారు కుమారస్వామి, జిల్లా ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షులు ఆగబోవు కుమార్, ఆగపోగు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సంతాప సభగా మారిన ఆత్మీయ సమ్మేళనం

**- సమ్మేళనానికి వస్తూ..మృత్యువాత పడిన రవికుమార్ - విషాదంలో పూర్వ విద్యార్థులు**



హైదరాబాద్,మహానది న్యూస్,జూన్ 01: పూర్వ విద్యార్థులంతా కలిసి సంతోషంగా సమ్మేళనోత్సవం జరుపుకోవాల్సి వేళ విషాదాన్ని చూడాల్సి వచ్చింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులైన స్నేహితుల కోలాహలంగా జరగాల్సిన ఆత్మీయ సమ్మేళనం సంతాప సభగా మారింది. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్ దోమలగూడలోని ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలకు చెందిన 1991నాటి పూర్వ విద్యార్థుల సమ్మేళనం దోమలగూడ ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సమ్మేళనానికి విచ్చేస్తున్న కరీంనగర్ జిల్లా పెద్దపల్లి కి చెందిన వ్యాయామ విద్యా ఉపాధ్యాయుడు కడారి రవికుమార్ (57) సిద్దిపేట సమీపంలోని కొమురవెల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈ సమ్మేళనానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 70 మందికి పైగా వ్యాయామ విద్యా ఉపాధ్యాయులు హాజరయ్యారు. అయితే తోటి పూర్వవిద్యార్థి రవికుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఈ ఆత్మీయ సమావేశాన్ని రవికుమార్ సంతాప సభగా మార్చారు. తమతో చదువుకున్న పూర్వ విద్యార్థి రవి కుమార్ అకాల మృతి పట్ల వారంతా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. దాదాపు 34 సంవత్సరాల తర్వాత ఆయన స్నేహితులు విషాదంలో మునిగిపోయారు. మృతుడు రవికుమార్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. కరీంనగర్ జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా, జిల్లా క్రీడల సమాఖ్య నిర్వహణ కార్యదర్శిగా ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు. రవికుమార్ అకాల మరణం పట్ల తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కోశాధికారి, ఓయూ ప్రొఫెసర్ రాజేష్ కుమార్, తెలంగాణ జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బి. లక్ష్మయ్య, రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ సోమన్న, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.బాలరాజ్, ఉపాధ్యక్షులు డాక్టర్ జగన్మోహన్ సిద్ధ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## అందాల పోటీలపై చూపిన శ్రద్ధ

# ప్రకృతి పరిరక్షణపై చూపండి

**- చెట్ల పరిరక్షణకు పటిష్ట చట్టం చేయండి**
**- రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగానైనా హామీ ఇవ్వండి**
**- తెలంగాణ సర్కారుకు -ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ విజ్ఞప్తి**



**హైదరాబాద్,మహనది న్యూస్, జూన్ 01:** అందాల పోటీలకు ప్రాధాన్యమిస్తున్న తెలంగాణ ప్రభుత్వం, ప్రకృతి పరిరక్షణ పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని "ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్" (ఈపీడీసీ) తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. పచ్చదనాన్ని కాపాడటానికి బదులు, చెట్ల నరికివేత యథేచ్ఛగా కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఈపీడీసీ వ్యవస్థాపక అధ్యక్షులు రంగయ్య మండిపడ్డారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగానైనా చెట్ల పరిరక్షణకు పటిష్టమైన చట్టాన్ని రూపొందించాలని ఆయన తెలంగాణ సర్కారుకు విజ్ఞప్తి చేశారు.

**నిరంతర చెట్ల విధ్వంసం - కొన్ని ఉదాహరణలు:**

రాష్ట్రంలో పచ్చదనం పట్ల వివక్ష కొనసాగుతోందని ఆయన పలు సంఘటనలను ఉదాహరణగా చూపారు.ఆరు నెలల క్రితం బాలానగర్ ప్రాంతంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయంలో భారీ చెట్లు నేలకూలాయి. అదే సమయంలో చిక్కడపల్లి ప్రాంతంలో ఒక ప్రభుత్వ కార్పొరేషన్‌కు చెందిన ప్రాంగణంలో పదుల సంఖ్యలో చెట్లు మాయమయ్యాయి. అంతకుముందు తెలంగాణ లేబర్ కమీషన్ కార్యాలయంలో వందల సంఖ్యలో చెట్లు మంటల్లో ఆహుతయ్యాయి.

కూకట్‌పల్లి ప్రాంతంలో లక్షల చెట్లతో నిండిన ఒక ప్రాంతం పచ్చ విధ్వంసానికి గురవుతోందని, దీనిపై అనేకమంది అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని రంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సంఘటనలు రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ పట్ల ఉన్న నిర్లక్ష్యాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయని ఆయన అన్నారు.

**ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఈపీడీసీ ప్రశ్నలు:**

సమాజం సుభిక్షంగా ఉండాలంటే పర్యావరణం సమతుల్యంగా, ప్రకృతి పటిష్టంగా ఉండాలని, అందుకు చెట్ల సంఖ్య నిండుగా ఉండాలని ఈపీడీసీ పేర్కొంది. కానీ, రాష్ట్రంలో అందుకు భిన్నంగా పచ్చదనం పట్ల వివక్ష కొనసాగుతోందని రంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కొందరి నాయనానందం కోసం అందాల పోటీలకు అత్యంత ప్రాధాన్యఇచ్చిన తెలంగాణ సర్కారు ప్రకృతి అందం కోసం ఎందుకు పూనుకోవడం లేదని ఆయన సూటిగా ప్రశ్నించారు. గుడి,బడి, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్తులతో పాటు ప్రైవేట్ ప్రాంతాల్లో కూడా చట్టానికి విరుద్ధంగా చెట్ల నరికివేత కొనసాగుతున్నా పట్టించుకునే వ్యవస్థ లేదన్నా రు. ఒకవైపు పచ్చదనం లోపంతో అనేక రకాల కాలుష్యాలు సమాజాన్ని పట్టి పీడిస్తున్నా పాలకు ల్లో చేతన కనిపించకపోవడం అత్యంత బాధాక రమన్నారు.

నెలరోజుల అందాల పోటీలతో సమాజానికి ఒన గూడిన ప్రయోజనం ఏమిటో పాలకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అదే ప్రకృతి పరిరక్షణతో అందివచ్చే ప్రయోజనం, లోపంతో జరిగే నష్టం ఏమిటో చెప్పే సమాధానం కౌన్సిల్ దగ్గర ఉందని రంగయ్య ఘాటుగా పేర్కొన్నారు.

**వాల్టా చట్టం మనుగడపై సందేహాలు:**

అసలు ఈ రాష్ట్రంలో వాల్టా చట్టం మనుగడలో ఉన్నట్టా? లేనట్టా? అర్థం కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో అర్బన్ బయో డైవర్సిటీ(యూబీడీ) అధికారులు, ఫారెస్ట్ అధికారులు వాల్టా చట్టాన్ని వారి స్వలాభానికి ఉపయోగించుకుంటున్నారే తప్ప, చెట్ల సంరక్షణ చేస్తున్నారన్న భరోసా కనిపించడం లేదని వాపోయారు.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో మూసీనది ప్రక్షాళన, హైడ్రా వ్యవస్థతో చెరువుల సంరక్షణ జరుగుతుందనుకున్న ఆశ కూడా తేలిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయని రంగయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గతానికి భిన్నంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యావరణ పరిరక్షణకు ఆశలు కల్పించారని, కానీ అధికారుల తీరుతో ప్రకృతి విధ్వంసం ఆగడం లేదని అన్నారు. ప్రభుత్వం తన చిత్తశుద్ధి ప్రదర్శించి, ఈ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చెట్ల పరిరక్షణకు ఒక పటిష్ట చట్టం హామీ ఇవ్వాలని తెలంగాణ సర్కారుకు విజ్ఞప్తి చేస్తోంది. లేదంటే, రాబోయే తరాలు తీవ్ర పర్యావరణ సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని రంగయ్య హెచ్చరించారు.

## ఇంజనీరింగ్ ఫీజులు పెంచొద్దు


**-బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ**



**కాచిగూడ, మహానది న్యూస్, జూన్ 01:** రాష్ట్రంలో ఇంజనీరింగ్, ప్రొఫెషనల్ కోర్సుల ఫీజులు పెంచవద్దని,పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేయవద్దని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కళాశాలల ఫీజులు పెంచాలనే ప్రతిపాదనలను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన కోరారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బి కేటగిరి సీట్లను ఆన్లైన్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయాలని, డొనేషన్లు తీసుకునే కళాశాలలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫీజుల పెంపుకు తెలంగాణ అడ్మిషన్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ ప్రతిపాదించిన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాలేజీల్లో ఒవైపు ఫీజులు పెంచుతుంటే.. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల బకాయిలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుండటంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లక్షల్లో ఫీజులు పెంచుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజుల కట్టలేక ఆందోళనకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలు చెల్లించకుంటే ఫీజుల పోరు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## గద్దర్ లేక తెలంగాణ ఒంటరయ్యింది...

**- సమాజ్ వాది పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రి**



కాచిగూడ, మహానది న్యూస్, జూన్ 01: గద్దర్ అవార్డులు సాంస్కృతిక రంగంలో ప్రోత్సహించడం తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని సమాజ్ వాది పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రి స్వాగతించారు. గద్దర్ అన్న జీవితమంతా ప్రజలదేనని, సంస్కృతిక రంగంలో గద్దర్ పాత్ర ఎనలేనిదన్నారు. తెలంగాణ సామాజిక, సాంస్కృతిక, మానవ సంబంధాలను తన రచనలతో వివిధ సామాజిక వర్గాలను ప్రభావితం చేసిన గొప్ప సాంస్కృతిక యోధుడు అని, ప్రజలను చైతన్యం చేయటంలో ఆయనకు ఎవరు సాటిరారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోసి-గొంగడి-కర్ర ధరించి ఆట, పాటలతో తెలుగు ప్రజలను నడిపించిన చరిత్ర గద్దరి అని అన్నారు. గద్దర్ గానానికి మయసులకు, స్త్రీ, పురుషులకు, కుల, మతాలకు, పేద, ధనిక వర్గాలకు, ప్రాంతాల, జాతుల, భాషలకతీతంగా స్పందించని సమాజం లేదన్నారు.

# నారి నారి నడుమ సరాగాలు...



హీరో శర్వానంద్ నటిస్తున్న రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటైర్టైనర్ 'నారి నారి నడుమ మురారి'. సంయుక్త మీనన్, సాక్షి విద్య కథానాయికలు. రామ్ అబ్బరాజు దర్శకుడు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మాతలు. సినిమా షూటింగ్ దాదాపు పూర్తికావచ్చింది. ఈ సందర్భంగా మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలుపెట్ట నున్నారు. ఏప్రిల్ 7న 'దర్శనమే..' అంటూ సాగే ఈ సినిమాలోని తొలిపాటను విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన సాంగ్ పోస్టర్‌లో శర్వానంద్, సంయుక్త రొమాంటిక్ మోడ్‌లో బైక్ రైడ్‌ని ఆస్వాదిస్తూ కనిపిస్తున్నారు. ఈ చిత్రానికి కథ: భాను భోగవరపు, మాటలు: నందు సవిరిగాన, కెమెరా జ్ఞానశేఖర్ వి.ఎస్, యువరాజ్, సంగీతం: విశాల్ చంద్రశేఖర్, సహనిర్మాత: అజయ్ సుంకర, నిర్మాణం: ఏకె ఎంటైర్టైన్మెంట్స్, అడ్వంచర్స్ ఇంటర్నేషనల్ ప్రై.లిమిటెడ్.

# బేబీ బిజీ బిజీ..

'బేబీ'.. అనగానే ముందు గుర్తొచ్చే రూపం వైష్ణవి చైతన్య. ఆ ఒక్క సినిమాతో రెండు తెలుగురాష్ట్రాల యువతనీ తనవైపు తిప్పుకున్నది ఈ అచ్చతెలుగందం. దీపం ఉండగానే ఇల్లు చక్కబె ట్టుకునే తత్వం కాదు వైష్ణవి చైతన్యది. 'బేబీ' తర్వాత సినిమాలు క్యూ కట్టినా.. ఆచితూచి అడుగులు వేస్తూ.. నచ్చిన పాత్రలనే ఎంచుకుంటూ ఓ ప్లాన్ ప్రకారం ముందుకెళ్తున్నది ఈ అందాలభా మ. సిద్ధు జొన్నలగడ్డకు జోడీగా ఆమె నటించిన 'జాక్' సినిమా ఏప్రిల్ 10న విడుదల కానుంది. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఆమె ద్విపాత్రాభినం చేయస్తున్నట్టు సమాచారం. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక హీరోయిన్‌కి ద్విపాత్రాభినయం చేసే అవకాశం రావడం అరుదే. ఆ అరుదైన ఛాన్స్‌ని వైష్ణవి కొట్టేసింది. ఈ సినిమా తర్వాత సూపర్‌హిట్ వెబ్‌సిరీస్ '90 ఏ మిడిల్‌క్లాస్ బయోపిక్' సీక్వెల్‌గా రూపొందుతున్న సినిమాలో ఆనంద్ దేవరకొండకు జోడీగా వైష్ణవి నటించనున్నది. సితార ఎంటైర్టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఇలా బడా సంస్థలు నిర్మిస్తున్న చిత్రాల్లో హీరోయిన్‌గా నటిస్తూ బిజీబిజీగా ఉన్నది వైష్ణవి చైతన్య. తాజాగా ఈ తెలుగమ్మాయి



ఓ ఫొటోషూట్‌లో పాల్గొన్నది. దీనికి సంబంధించిన కొన్ని ఫొటోలను సోషల్‌మీడియాలో షేర్ కూడా చేసింది. ఈ ఫొటోల్లో యువరాణిలా మెరిసిపోతున్న వైష్ణవి చైతన్యను చూడొచ్చు.

# రీఎంట్రీ బాలయ్య సినిమాతోనే?




ఎన్టీఆర్ బయోపిక్స్ కథానాయకుడు, మహానాయకుడు సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరవయ్యారు బాలీవుడ్ నటి విద్యాబాలన్. ఆ చిత్రాల్లో ఆమె ఎన్టీఆర్ సతీమణి బసవతారం పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మళ్లీ తెలుగు తెరపై విద్యాబాలన్ కనిపించలేదు. అయితే.. మళ్లీ ఆమె టాలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇస్తున్నారనేది లేటెస్ట్ న్యూస్. అది కూడా బాలయ్య సినిమాతోనేనట. ప్రస్తుతం బ్లాక్‌బస్టర్ 'అఖండ' సీక్వెల్ 'అఖండ – తాండవం' షూటింగ్‌లో బాలయ్య బిజీగా ఉన్న విషయం తెలిసిందే. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రంలో విద్యాబాలన్ ఓ కీలక పాత్ర పోషించనున్నారట. ఇందులో కథ రీత్యా ఓ పవర్‌ఫుల్ పొలిటికల్ లీడర్ పాత్ర ఉందట. ఆ పాత్రకోసం విద్యాబాలన్‌ని బోయపాటి సంప్రదించారనీ, కథ, పాత్ర విన్న తర్వాత ఆమె చేయడానికి అంగీకరించారని సమాచారం. స్టార్‌హీరోయిన్ విద్యాబాలన్‌తో ఆ పాత్ర చేయిస్తున్నారంటే.. కచితంగా కథలో కీలకమైన పాత్రే అయ్యుంటుదని ప్రేక్షకులు భావిస్తున్నారు. ఇప్పటికే ఇందులో సంజయ్‌దత్ కీలక పాత్ర పోషిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. ఇప్పుడు విద్యాబాలన్ కూడా తోడవ్వడంతో.. 'అఖండ–తాండవం' చిత్రానికి బాలీవుడ్‌లోనూ క్రేజ్ ఏర్పడటం ఖాయం అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# నిరాశపర్చిన రష్మిక సికిందర్



ఈ మధ్య కాలంలో సల్మాన్ ఖాన్ మూవీకి ఇంత తక్కువ ఓపెనింగ్స్ రావడం ఇదే అని ట్రేడ్ వర్గాలు చెబుతున్నారు. సల్లూభాయ్ గత చిత్రాలు "బజరంగీ భాయీ జాన్, కిక్, దబాంగ్, టైగర్ జిందా హై, సుల్తాన్, భరత్, ప్రేమ్ రతన్ ధన్ పాయో, ఏక్ థా టైగర్, టైగర్ – 3" చిత్రాలకు ఇంతకంటే మంచి ఓపెనింగ్స్ వచ్చాయంటున్నారు. సల్మాన్ తోటి హీరోలు చాలామంది ఇప్పటికే రూ. 500 కోట్ల క్లబ్‌లో చేరితే సల్మాన్ మాత్రం ఆ విషయంలో వెనకబడి పోయారంటున్నారు. షారుఖ్ ఖాన్ 'పఠాన్, జవాన్' చిత్రాలతోనూ, రణబీర్ కపూర్ 'యానిమల్'తోనూ, సన్నీ డియోల్ 'గద్దర్ –2'తో, విక్కీ కౌశల్ 'ఛావా' చిత్రంతో రూ. 500 కోట్ల మైలురాయిని దాటేశారు. చివరకు గత యేడాది వచ్చిన హారర్ మూవీ 'స్త్రీ –2' సైతం రూ. 500 కోట్ల కబ్ లో చేరిపోయింది. కానీ సల్మాన్ ఇంకా ఆ మ్యాజిక్ ఫిగర్ ను అందుకోలేకపోతున్నారు. విశేషం ఏమంటే రశ్మిక మందణ్ణ ఇప్పటికే ఆ మైలురాయిని మూడు చిత్రాలతో దాటేసింది. ఆమె నటించిన 'యానిమల్, పుష్ప –2, ఛావా' లు రూ. 500 కోట్ల కబ్ల్ లో చోటు సంపాదించుకున్నా యి. కానీ ఇప్పుడీ 'సికందర్' మాత్రం రూ. 500 కోట్ల గ్రాస్ ను దాటడం కష్టమనే అంటున్నారు. ఆదివారంతో పోల్చితే... సోమవారం ఈద్ పండగ సెలవు కాబట్టి కొంత కలెక్షన్స్ పెరిగే ఛాన్స్ లేకపోలేదు. అయితే పులి మీద పుట్రలా ఇప్పటికే ఈ సినిమా ఆన్ లైన్ లో పైరసీ అయి చక్కర్లు కొడుతోందని బాలీవుడ్ వర్గాలు మొత్తుకుంటున్నాయిస్టార్ హీరోయిన్ రశ్మిక మందన్నా కెరీర్ అప్రతిహతంగా సాగిపోతోంది. వరుస విజయాలతో ముందుకు పోతున్న రశ్మికకు ఆ మధ్య వచ్చిన 'గుడ్ బై', 'మిషన్ మజ్ను' వంటి సినిమాలు నిరాశకు గురి చేశాయి. అయితే.. 2023 చివరిలో వచ్చిన రణబీర్ కపూర్ 'యానిమల్'తో మళ్ళీ ఒక్కసారిగా రశ్మిక మందణ్ణ కెరీర్ ఊపందుకుంది. ఆతర్వాత యేడాది 2024 డిసెంబర్‌లో వచ్చిన 'పుష్ప–2' ఆ యేడాది అత్యధిక కలెక్షన్స్ వసూలు చేసిన మూవీగా బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. ఇక ఈ యేడాది ఫిబ్రవరిలో వచ్చిన 'ఛావా' సినిమా జాతీయ స్థాయిలో రశ్మిక మందణ్ణకు ప్రేక్షకులు నీరాజనాలు పట్టేలా చేసింది. ఆ రకంగా రశ్మిక హ్యాట్రిక్ ను సాధించింది. సల్మాన్‌ఖాన్ మూవీ 'సికందర్' ఆమెను తీవ్ర నిరాశకు గురి చేసింది.

# ఏ వైపు మంచిది?



చక్కటి ఆరోగ్యానికి చిక్కటి నిద్ర ఎంతో అవసరం. లేకుంటే.. అనారోగ్యాల పాలవ్వడం ఖాయం! ఈ విషయంలో నిద్ర ఒక్కటే కాదు.. నిద్రపోయే భంగిమ కూడా ఎంతో కీలకం. అందులోనూ ఎడమవైపు తిరిగి పడుకుంటే.. ఎంతో ప్రయోజనకరం.

రకరకాల మనుషులు.. రకరకాలుగా నిద్రిస్తుంటారు. కొందరు వెల్లకిలా పడుకుంటే.. మరికొందరు బోర్లా పడుకుంటారు. కొందరు కుడివైపు వాలితే.. ఇంకొందరు ఎడమవైపునకు ఒరుగుతుంటారు. వీటన్నిట్లోకి.. ఎడమవైపు తిరిగి పడుకోవడమే ఆరోగ్యానికి ఎంతో మేలని అంటున్నారు నిపుణులు.

ఇలా పడుకోవడం వల్ల భవిష్యత్తులోనూ ఆరోగ్య సమస్యలు తలెత్త కుండా ఉంటాయని చెబుతున్నారు. ఎడమవైపు తిరిగి పడుకోవడం గుండెకు ఎంతో మేలుచేస్తుంది. గుండె ఎడమ వైపునే ఉంటుంది కాబట్టి, అదే దిశలో పడుకుంటే గురుత్వాకర్షణ వల్ల ఎలాంటి ఇబ్బందుల్లేకుండా గుండెకు రక్త సరఫరా అవుతుంది. ఫలితంగా గుండెపై ఒత్తిడి తగ్గిపోతుంది.

గురక సమస్య తగ్గాలంటే.. ఎడమవైపు తిరిగి పడుకోండి. శ్వాస తీసుకోవడం కూడా సులభం అవుతుంది. ఎడమవైపు తిరిగి పడుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. తిన్న ఆహారం జీర్ణం కాగా, మిగిలిన వ్యర్థాలు, టాక్సిన్లన్నీ పేగుల్లోనే ఉండిపోతాయి. కుడివైపు కన్నా ఎడమవైపు తిరిగి పడుకున్నప్పుడే.. అవన్నీ సులభంగా కిందికి వెళ్లిపోతాయి.

ఇక ఎడమ వైపు తిరిగి పడుకోవడం వల్ల.. వీపు, నడుము, వెన్నె ముకపై ఒత్తిడి తగ్గుతుంది. మంచి నిద్ర పడుతుంది. ముఖ్యంగా.. గర్భిణులు ఇలా పడుకోవడం వల్ల పిండానికి రక్త ప్రసరణ మెరుగవుతుంది. ఆరోగ్యానికి ఎంత మంచిదైనా..

ఎప్పుడూ ఒకే వైపు తిరిగి పడుకోలేం. అందుకే కాసేపు కుడివైపు, వెల్లకిలా పడుకున్నా.. వీలైనంత ఎక్కువ సమయం ఎడమ వైపు తిరిగి పడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# అరిగిన కీళ్లకు కణాలతో వైద్యం



మోకాళ్ల నొప్పులు వృద్ధాప్య సమస్యల్లో ఒకటిగా చెప్పుకొనేవారు. అదంతా ఒకప్పుడు. ఇప్పుడు నలభై ఏళ్లకే మోకాళ్లే కాదు ఇతర కీళ్లలోనూ నొప్పులతో తిప్పలు పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నది. ఈ సమస్యకు సకాలంలో చికిత్స చేయకపోతే శస్త్ర చికిత్స చేయాల్సిందే. ప్రారంభంలోనే పీఆర్‌పీ థెరపీతో కీళ్ల నొప్పులకు చెక్ పెట్టొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ కీళ్ల నొప్పులకు కారణాలు ఏమిటి? నొప్పికి ముందే వాటిని ఎలా గుర్తించాలి? ఆపరేషన్ లేకుండానే పీఆర్‌పీ థెరపీతో ఎలా నివారించవచ్చో నేటి ఊపిరిలో తెలుసుకుందాం. కీళ్ల నొప్పులు వయసుతో సంబంధం ఉన్న వ్యాధుల్లో ఒకటిగా వైద్యులు గుర్తించారు. జీవనశైలిలో, ఆహారపు అలవాట్లలో మార్పులతో కీళ్ల నొప్పులకూ వయోసడలింపు వచ్చేసింది. అరవైకి ఇరవై ఏళ్ల ముందే మోకాళ్ల నొప్పులు బాధిస్తున్న వారు నానాటికీ పెరుగుతున్నారు. మోకీళ్లే కాదు భుజం నొప్పి, వెన్నునొప్పి, తుంటి నొప్పి ఇలా శరీరంలోని కీళ్ల నొప్పులతో బాధపడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. కీళ్ల నొప్పులకు జీవన శైలి, ఆహారమే కాదు నిర్లక్ష్యమూ ఓ కారణమే.

మోకాలి నొప్పులు: కొందరిలో మోకాలి కీలులోని కార్టిలేజ్ అరుగుతుంది. దీని వల్ల కీళ్లలోని ఎముకల మధ్య రాపిడి జరుగుతుంది. అప్పుడు కీలులో నొప్పి కలుగుతుంది. ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీస్తుంది. ఈ నొప్పి వల్ల రోగి లేవడం, నడవడం కష్టంగా ఉంటుంది. వయసు రీత్యా వచ్చే ఈ సమస్యను ప్రారంభదశలోనే గుర్తించి, పీఆర్‌పీ థెరపీ చేస్తే.. సర్జరీ అవసరమే ఉండదు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే, రోగం ముదిరిన తర్వాత చికిత్స చేయాలంటే శస్త్ర చికిత్స ద్వారా కీలు మార్పిడి చేయడమే పరిష్కారం.

భుజం నొప్పి: భుజాల్లోని టెండాన్ (ఎముకను అతుక్కుని ఉండే కం దరాల అంచు)కు పగుళ్లు రావడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ ఏర్పడుతుంది. అంటే ఎముకను అతుక్కునే కండ రం చివరి భాగం దెబ్బతిని, ఎర్రగా మారుతుంది. అందువల్ల భుజంలో నొప్పి కలుగుతుంది. చేతిని అటూ, ఇటూ, పైకి, కిందికి కదిలించేటప్పుడు ఇబ్బందిగా ఉంటుంది. సమస్య తీవ్రంగా ఉంటే చేయి కదిలించడం కష్టం. చేతిని కదల్చలేని 'ఫ్రాజన్ షోల్డర్' అంటారు. ఈ సమస్యను సకాలంలో గుర్తిస్తే పీఆర్‌పీ థెరపీతో నివారిం చవచ్చు. నిర్లక్ష్యం చేస్తే సర్జరీ తప్పదు.

ఎవ్యాస్క్యులర్ నెక్రోసిస్ ఆఫ్ హిప్: కరోనా చికిత్సలో స్టెరాయిడ్స్ వినియోగించడం వల్ల ఈ సమస్యతో బాధపడే రోగుల సంఖ్య కోవిడ్ తర్వాత పెరిగింది.

స్టెరాయిడ్స్ వాడితే తుంటిలోని కీళ్లలో రక్త ప్రసరణ తగ్గుతుంది. తుంటిలోని ఎముక కుళ్లుతుంది. నొప్పి తీవ్రంగా బాధిస్తుంది. తుంటిని కదిలించలేరు. ఈ సమస్య చిన్న వయసులో వస్తే వారికి పీఆర్‌పీ చికిత్స ఉత్తమమైన పద్ధతి.

టెన్నిస్ ఎల్బో సమస్య: మోచేతిలోని ఒక చిన్న ఎముకతో ఐదు కండరాలు అనుసంధానమవుతాయి. ఈ కండరా లను 'కామన్ ఎక్స్‌టెన్షన్ టెండాన్'అంటారు. ఆట లు ఆడినప్పుడు, ఏదైనా దెబ్బ తగిలినప్పుడు ఆ కండరాలు ఎముకతో అనుసంధానమైన చోట పగుళ్లు ఏర్పడతాయి. అందువల్ల తీవ్రమైన నొప్పి కలుగుతుంది. ఆటలు ఆడలేరు. అలాంటి వారికి శస్త్ర చికిత్స అందుబాటులో లేదు. వారికి పీఆర్‌పీ థెరపీతో ఉపశమనం ఉంటుంది.

అరికాళ్లలో నొప్పి:అరికాళ్లలో నొప్పి (మడమ నొప్పి)ని 'ప్లాంటార్‌ఫేషి ఐటీస్' అంటారు. ఎక్కువగా నడవడం వల్ల, చెప్పులు లేకుండా పనిచేయడం వల్ల, గరుకు ప్రదేశాల్లో చెప్పులు లేకుండా నడవడ టం వల్ల మడమలో ప్లాంటర్ పొర తెగుతుంది. అప్పుడు మడమ (అరికా ళ్ల)లో తీవ్రమైన నొప్పి కలుగుతుంది. నడవడం కష్టమవుతుంది. ఈ సమస్యకు కూడా సర్జరీ లేదు. పీఆర్‌పీ థెరపీ చక్కటి పరిష్కారం.

ప్రారంభ దశలో..: కొంతమంది 30 నుంచి 40 ఏళ్ళ మధ్య వయసులో జాయింట్ పెయిన్స్ వస్తే.. అవగాహన లేక పట్టించుకోరు. ఉపశమనం కోసం ఆయింట్‌మెంట్లు రాసుకుంటారు. నూనెలతో మర్దనా చేసుకుంటారు.

కొంతమంది నొప్పుల మాత్రలు వాడతారు. ఇవి వాడటం వల్ల తాత్కాలిక ఉపశమనం కలుగుతు ంది. కొన్నిరోజుల తర్వాత సమస్య మళ్లీ మొదటికి వస్తుంది. ఇంకొందరు కొన్ని ప్రత్యేక వ్యాయామాల ద్వారా తగ్గించుకోవచ్చని ప్రయత్నాలు చేస్తుంటారు. వ్యాయామాలతో కీళ్ల నొప్పులు తగ్గకపోవడమే కాకుండా తీవ్రమవుతాయి.

అందుకని తరచూ నొప్పులు వచ్చినా లేక దీర్ఘకాలంగా నొప్పులు బాధిస్తున్నా వైద్యులను సంప్రదించాలి. ఎక్స్‌రే లేదా స్కానింగ్ తీయించుకోవాలి. ఇబ్బందిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే పీఆర్‌పీ థెరపీతో ఆదిలోనే సమస్యకు అడ్డుకట్ట వేయవచ్చు. కీళ్ల సమస్యల లక్షణాలు: కీళ్లలో తీవ్రమైన నొప్పి రావడం, 15 రోజుల పాటులేదా తరచూ నొప్పి ఉంటే కీళ్లలో డ్యామేజ్ ఉందేమోనని అనుమానించాలి. కీళ్లను కదిలించలేకపోవడం, కీళ్లలో వాపు.

మణికట్టు, భుజం, చీలమండ, భుజంలో తీవ్రమైన నొప్పి పీఆర్‌పీ థెరపీ ఎలా చేస్తారు?: 'ప్లేట్‌లెట్స్ రిచ్ ప్లాస్మా' థెరపీని 'పీఆర్‌పీ థెరపీ' అంటారు. ఇది పాత చికిత్సా పద్ధతే! కొన్ని కారణాల వల్ల ఈ పద్ధతి ప్రాచుర్యంలో లేదు. ఐదారేళ్ల నుంచి ఈ చికిత్సా విధానానికి ఆదరణ పెరుగుతున్నది. ఈ థెరపీ గురించి అనేక పరిశోధనలు జరిగాయి. మెరుగైన ఫలితాలు గుర్తించడంతో దీనికి మళ్లీ డిమాండ్ పెరిగింది. ఈ పీఆర్‌పీ చికిత్సా పద్ధతిలో రోగి నుంచి 20 మిల్లీలీటర్ల రక్తాన్ని సేకరిస్తారు. ఆ రక్తాన్ని ఒక టెస్ట్ ట్యూబ్‌లో నింపిన తర్వాత పీఆర్‌పీ సెంట్రిఫ్యూజ్ మెషిన్‌లో తిప్పుతారు. రక్తం నుంచి 'గ్రోత్ ఫ్యాక్టర్ సెల్స్' వేరవుతాయి. ఈ సెల్స్‌ను దెబ్బతిన్న కీలు



భాగంలోకి ఇంజెక్షన్ ద్వారా ఇస్తారు. కార్టిలేజ్ దెబ్బతిన్న భాగంలోకి గ్రోత్ ఫ్యాక్టర్ సెల్స్'ని పంపడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. కార్టిలేజ్ రీ మోడలింగ్ (పునరుత్పత్తి) జరుగుతుంది. ఈ విధంగా సమస్య తీవ్రతను బట్టి రెండు లేదా మూడు సార్లు పీఆర్‌పీ థెరపీ చేయాల్సిన అవసరం ఉంటుంది. థెరపీ అనంతరం మూడు నుంచి నాలుగు నెలలపాటు వైద్యుల పరిశీలన (ఫాలో అప్) అవసరం. థెరపీ అనంతరం కొన్ని జాగ్రత్తలు, ఆహార నియమాలు పాటించాలి. వైద్యులు సూచించిన వ్యాయామాలు చేయాలి. క్రీడల్లో గాయపడ్డ వారికి కూడా పీఆర్‌పీ థెరపీ మంచి ఫలితాలు ఇస్తుంది.

Published & Owned by Mamidi Somaiah, H.No.3- 2-92/27 to 276/506, Rock Town Colony, LB Nagar, Hyd, Rangareddy, Telangana- 500068. Printed at Ellora Printers, LN Nagar, Industrial Estate, Uppal, Rangareddy, Telangana. Editor- Mamidi Somaiah. Ph No. 9 00933723. RNI No. TEL TEL . 12/48343